

జిసిసి చైర్మన్ కిడారి పర్యటన

ప్రజాశక్తి- పెదబయలు:మండల కేంద్రంలో రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, జీసీసీ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం కిడారి శ్రావణ్ కుమార్ జీసీసీ గ్యాస్ గొడౌన్, డిపో ను తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం జీసీసీని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాంగి సోనే దన్ను, మాజీ వైస్ ఎంపీపీ వెచ్చంగి కొండయ్య, మాజీ సర్పంచ్ త్రినాథ్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి, బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిడారి

పోలవరం నిర్వాసితులకు అన్యాయం చేస్తే ఊరుకోం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- ముంపు మండలాల్లో ప్రజా చైతన్యయాత్ర
- ఎక్కడికక్కడ అపూర్వ స్వాగతం
- తమ కష్టాలను యాత్రా బృందానికి చెప్పుకున్న బాధితులు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

పోలవరం నిర్వాసితులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాలకులను హెచ్చరించారు. కాంటూరుతో సంబంధం లేకుండా నిర్వాసితులందరికీ ఒకే దశలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆయన గురువారం ఎటపాక, కూనవరం, చింతూరు మండలాల్లోని పోలవరం నిర్వాసిత గ్రామాల్లో పర్యటించారు. జనం గోడు విన్నారు. ఎక్కడికక్కడ యాత్రా బృందానికి అపూర్వ స్వాగతం లభించింది.

ఎటపాక : మండలంలోని వీరాయిగూడెం, మురుమూరు గ్రామాల్లో ప్రజా చైతన్యయాత్ర సాగింది. వి.శ్రీనివాసరావుకు పూలమాలలు వేసి గ్రామస్తులు స్వాగతం పలికారు. అనంతరం ముంపు గ్రామాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరాయిగూడెం మహిళ కొరసా లక్ష్మి, తదితరులు తమ కష్టాలను చెప్పుకున్నారు.



ఎటపాక మండలం వీరాయిగూడెంలో ఘనంగా స్వాగతం పలుకుతున్న మహిళలు

40 అడుగుల వరదకే తమ గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంటోందని, అయినా తమ గ్రామాన్ని ప్రభుత్వం ముంపు లెక్కల్లోకి తీసుకోలేదని వాపోయారు. మురుమూరు గ్రామస్తులు తమ గ్రామాన్ని 41.15 కాంటూరులో చేర్చి పరిహారం అందించేలా కృషి చేయాలని వినతి పత్రం అందించారు. అనంతరం వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నిర్వాసితుల కష్టాలు ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. కాంట్రాక్టర్లకు దోచిపెట్టడం కోసమే ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును కడుతోందా ? అని ప్రశ్నించారు. నిర్వాసితులకు నష్టపరిహారాన్ని పెంచి ఇవ్వాలని అన్నారు. ఆ తరువాతనే ప్రాజెక్టు కట్టాలని తెలిపారు. నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం చేసిన పోరాటాలతో ఇప్పుడు ప్రతి రాజకీయ పార్టీ నిర్వాసితుల గురించి మాట్లాడేలా చేస్తున్నామని అన్నారు. ఇప్పుడు అందరికీ ఒకే దశలో పరిహారం చెల్లించి, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తూ మరో దశ పోరాటానికి నిర్వాసితులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఐవి, మండల కార్యదర్శి కాకా అర్జున్ దొర, మండల కమిటీ సభ్యులు పులుసు బాలకృష్ణ, ఇరపా అజయ్, జి.హుస్సేన్, ఇరప సత్యం పాల్గొన్నారు.



కూనవరం మండలం గిన్నెల బజారులో ప్రజలతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కూనవరం : మండలంలోని గిన్నెల బజార్‌లో వి.శ్రీనివాసరావు పర్యటించారు. పోలవరం ముంపు వల్ల ప్రతి ఏడాదీ తాము నీట మునుగుతూ నరక యాతన పడుతున్నామని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పరిహారం పెంచి నిర్వాసితులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, ఎంపిటిసి జయసుధ, సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, సిపిఎం విఆర్.పురం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, కర్నాటి శ్రీనివాసరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, గడ్డిపాటి షణ్ముకేశ్వరావు, ధర్మయ్య, మడెం బాబు, తమ్మయ్య, సుమన్, సుధారాణి పాల్గొన్నారు.

ముకునూరు గ్రామస్తుల వినతి

చింతూరు : తమ సమస్యలపై వి.శ్రీనివాసరావుకు ముకునూరు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గత వరదల్లో గ్రామం మొత్తం ముంపుకు గురైందని, పడవలు కూడా నడిచాయని తమ బాధను వెళ్లగక్కారు. గ్రామంతా మునిగిపోతున్నా కొన్ని గృహాలనే ముంపులో చేర్చడంపై వి.శ్రీనివాసరావు మండిపడ్డారు. నిర్వాసిత ప్రజానీకానికి పునరావాసం, పరిహారం కల్పించడంలో పాలకులు అశ్రద్ధ చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, మండల కార్యదర్శి పల్లపు వెంకట్, నాయకులు సీసం సురేష్, లక్ష్మణ్, పెద్ద రాములు, నాగేష్, గ్రామ సర్పంచ్ బీరబోయిన సత్యకుమారి పాల్గొన్నారు.



శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న ముకునూరు గ్రామస్తులు



నివాళి అర్పిస్తున్న కలెక్టర్

మొల్లమాంబ జీవితం యువతకు ఆదర్శం

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: నేటి యువత, విద్యార్థిని, విద్యార్థులు కవయిత్రి మొల్ల మాంబ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని స్ఫూర్తి పొందాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కవియిత్రి మొల్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. కవయిత్రి మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొల్ల జయంతిని అధికారంగా నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. మొల్ల ఆనాటి పరిస్థితులను ఎదుర్కొని సాహసోపేతంగా రామాయణం రచించారని, అదే మొల్ల రామాయణం గా ప్రసిద్ధి చెందిందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. పద్మలత, సిపిఓ ఎస్ఎస్ఆర్ కే పట్నాయక్, ఉద్యాన శాఖ అధికారి రమేష్ కుమార్ రావ్, పర్యాటక అధికారి జి.దాస్, డిపిఆర్ఓ గోవిందరాజులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు:సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ పోస్టును అర్హత గల ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో పనిచేస్తున్న మహిళా స్కూల్ అసిస్టెంట్లు నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త స్వామి నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. దరఖాస్తులను 19 తేదీలోపు స్థానిక పిఎంఆర్సి భవనంలో సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలని చెప్పారు.

నేడు 'మీ కోసం' రద్దు

ప్రజాశక్తి-పాడేరు : ఈ నెల 14వ తేదీ శుక్రవారం జరగనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీ కోసం రద్దు చేస్తున్నట్లు జిల్లా కలక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం హెూలీ పండుగ ప్రభుత్వ సెలవు దినం పురష్కరించుకుని మీ కోసం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: రంగిలిసింగి పంచాయతీ గ్రామంలో నెలకొన్న కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ స్థానిక సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ఆ పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రాన్ని గిరిజనులు అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల నాయకుడు పి.డుంబు మాట్లాడుతూ. కొత్త రేషన్ కార్డులు మంజూరుతో పాటు యాడింగ్ చేయాలన్నారు. జాబ్ కార్డులు కూడా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో కనీస మౌలిక సౌకర్యాలు వీధి కాలువలు, సీసీ రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెంటనే వాటిని మంజూరు చేయాలని చెప్పారు. అర్హులైన గిరిజనులందరికి పీఎం జన్మన్ పథకం ద్వారా గృహాలు మంజూరు చేసి బిల్లు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కేందాస్, రాందాస్, పొద్దు, జిన్ను, రాము, కృష్ణారావు, నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

శిశు మరణాలపై వైద్య బృందం పరిశీలన

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని తులసిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కల్లేరు, చదలవాడ గ్రామాలను డిప్యూటీ డియంహెచ్ఓ డాక్టర్ పుల్లయ్య మార్గదర్శకత్వంలో వైద్య బృందం గురువారం సందర్శించింది. శిశు మరణాలపై తల్లి దండ్రులను, ఫీల్డ్ సిబ్బందిని విచారించారు. శిశు మరణాల కారణాలను విశ్లేశించి, తగిన నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. తగిన వైద్యం, పోషణ, మాత శిశు సంరక్షణ వంటి వాటిపై అవగాహన కార్యక్రమాలు బలోపేతం చేయాలన్నారు. సమర్ధవంతమైన ప్రణాళికతో భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచించారు. ఈ కార్యక్రమంలో చింతూరు ఐటిడిఎ పిఓ అపూర్వ భరత్, ప్రత్యేక వైద్య నిపుణులు కాకినాడ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు జ్ఞాన సురేష్ కుమార్, సిహెచ్.గోపిచంద్, జి.సర్వేశ్వరరావు, ఏ.శ్రావణి, యం.రాజేష్, కె.శ్రీకాంత్ రెడ్డి, తులసిపాక డాక్టర్ ఉదయ్ కుమార్ రెడ్డి, డాక్టర్ నిఖిల్, సూపర్ వైజర్లు, ఎయన్‌యంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



తులసిపాక ఆసుపత్రి వద్ద వైద్య బృందం



సమావేశంలో పాల్గొన్న ఐటిడిఎ పిఓ కట్టా సింహాచలం

రైతులు మోసపోకుండా జీడి పిక్కల కొనుగోలు

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని జీడిపిక్కల రైతులు దళారుల దగ్గర మోసపోకుండా ఎక్కడికక్కడ జీడిపిక్కలు కొనుగోలు చేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయ సమావేశ మందిరంలో డివిజన్ పరిధిలోని ఏడు మండలాలకు చెందిన జీడిపిక్కల రైతులు, జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ ప్రతినిధులతో గురువారం పిఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో జీడిపిక్కల రైతులకు ఒక వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేయడం జరుగుతుందని తెలిపారు. జీడిపిక్కల రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ ఏడాది వీడీవీకేల ద్వారా 100 మెట్రిక్ టన్నుల జీడిపిక్కలు కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. జీడి పిక్కల తూకంలో రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఏజెన్సీలోని కొనుగోలు చేసిన జీడిపిక్కలు ఎక్కడికక్కడ ప్రాసెసింగ్ చేసి మార్కెటింగ్ పంపే విధంగా తగు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. తమకు పురుగు మందులు, యంత్రాలు సరఫరా చేయాలని జీడి మామిడి రైతులకు ప్రాజెక్ట్ అధికారి దృష్టికి తీసుకొచ్చారు. దీనికి పిఒ సానుకూలంగా స్పందించారు. ఎరువులు, పురుగు మందులు తొలకరికి ముందు జీడి మామిడి మొక్కలు సరఫరా చేయాలని, ఏజెన్సీలో జీడిపిక్కల ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కారం సురేష్, కె.భాస్కర్ రెడ్డి తదితరులు పిఒను కోరారు. ఈ సమావేశంలో పిహెచ్ఓ కె.చిట్టిబాబు, ఉద్యానవన శాఖ సబ్ అసిస్టెంట్లు నూకరాజు, నాగరాజు, అబ్బాయి రెడ్డి, శోభన్ బాబు, జీడి మామిడి రైతులు, జీడి పిక్కల ప్రాసెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీషాదేవిని బర్తరఫ్ చేయాలి

ప్రజాశక్తి మారేడుమిల్లి : గిరిజన చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులకు పక్క గృహాలు మంజూరు చేయాలని అసెంబ్లీలో కోరిన రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవిని ఎమ్మెల్యే పదవి నుండి బర్తరఫ్ చేయాలని ఎపి ఆదివాసీ జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. దేవీపట్నం మండలం, ఇందుకూరులో జరిగిన సమావేశంలో శేఖర్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు ఫలితంగా వచ్చిన షెడ్యూల్డ్ ప్రాంతంలో 1917, 1959, 1970 భూ బదలాయింపు చట్టాలకు, పీసా చట్టానికి విరుద్ధంగా ఎమ్మెల్యే మాట్లాడటం సరికాదన్నారు. గిరిజనేతరులకు పక్క గృహాలు మంజూరు చేయాలన్న వ్యాఖ్యలను ఎమ్మెల్యే వెనక్కి తీసుకోవాలని, లేకుంటే భవిష్యత్తులో ఆదివాసీ ప్రజానీకమే ఓటుతో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు కారం రామన్న దొర, యలగాడ నాగేశ్వరరావు, అరగంటి వీరభద్రరెడ్డి, కుంజం వెంకటరమణ, అరగంటి నాగిరెడ్డి, కుళ్ల రామిరెడ్డి, కుళ్ల చిరంజీవి రెడ్డి, కుళ్ల చిట్టబ్బాయి రెడ్డి, చెదల లచ్చిరెడ్డి, తాల్లూరి కన్నారెడ్డి, కెచ్చెల దేవిశ్రీ ప్రసాద్ రెడ్డి, కెచ్చల చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1/70 చట్టం రక్షణకు అసెంబ్లీలో ప్రకటన చేయాలి

-ఎమెల్యే శిరీషాదేవి క్షమాపణ చెప్పాలి- ఆదివాసీ గిరిజన సంఘం నిరసన

ప్రజాశక్తి-అరకులోయ:రాష్ట్ర శాసనసభలో రంపచోడవరం ఎమెల్యే మిరియాల శిరీషాదేవి గిరిజనేతరులకు పక్కా గృహాలు మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని చట్టసభలో మాట్లాడడం ఆదివాసీ హక్కులు, చట్టాలకు తీవ్రమైన ద్రోహం చేయడమేనని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో అరకువేలిలో నిరసన చేపట్టారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, మండల నాయకులు జగన్నాథం మాట్లాడుతూ, 1952 ముందు నుండి రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్నా 40 శాతం గిరిజనేతరులకు పక్కా గృహాలు నిర్మించుకోవడానికి కూటమి ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని రంపచోడవరం ఎమెల్యే మిరియాల శిరీషాదేవి అడగడం 1/70 చట్టం ఉల్లంఘించడమే అవుతుందని తెలిపారు. 1/70 చట్టంపై శాసనసభ స్పీకర్ ప్రకటనకు వ్యతిరేకంగా ఆదివాసులు తీవ్రస్థాయిలో తిరగబడ్డారని స్పందించిన ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి 1/70 చట్టం రక్షణకై కట్టుబడి ఉన్నామని ప్రకటించడం నిజమేనా లేక ఆదివాసులకు నమ్మించి మోసం చేయడమా అని వారు ప్రశ్నించారు. రాష్ట్ర అసెంబ్లీలో 1/70 చట్టం రక్షణకై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రజాప్రతినిధి అయివుండి ఆదివాసీ హక్కులు, చట్టాలు నిర్వీర్యం చేసేవిధంగా మాట్లాడమంటే రాష్ట్ర ప్రభుత్వం 1/70 చట్టం సవరణకు కుట్రలో భాగమేనని అనుకోవాల్సి వస్తుందన్నారు. ఎమెల్యే శిరీషాదేవి ఆ మాటలు వెనక్కి తీసుకుని ఆదివాసీ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జీఓ నెంబర్-3కు చట్టబద్ధత కల్పించాలని, ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిపికేషన్ విడుదల చేయాలన్నారు. అనంతగిరి మండలంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ఎన్నికల ప్రక్రియ మెరుగుకు సూచనలు ఇవ్వండి

- రాజకీయ పార్టీలకు జిల్లా కలెక్టర్ సూచన

ప్రజాశక్తి-పాడేరు : చట్టపరమైన విధానంలో ఎన్నికల ప్రక్రియలను మరింత బలోపేతం చేయడానికి భారత ఎన్నికల సంఘం ప్రత్యేకంగా వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులు, సీనియర్ నాయకులను ఆహ్వానిస్తోందని, అందులో భాగంగా ఎన్నికల ప్రక్రియను మరింత మెరుగు పరిచేందుకు సూచనలు, సలహాలు ఎన్నికల సంఘానికి అందివ్వాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం కలెక్టర్ చాంబర్ లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్ జాబితా తయారీలో సమస్యలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకు రావాలని ఆ ప్రతినిధులకు తెలియజేశారు. ఈఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి, చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ స్థాయిలో ఏవైనా పరిష్కరించని సమస్యల కోసం ఈ ఏడాది ఏప్రిల్ 30 తేది లోగా అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి భారత ఎన్నికల సంఘం సూచనలను ఆహ్వానిస్తోందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సంఘం కల్పించిన ఈ సదవకాశాన్ని అన్ని రాజకీయ పార్టీలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె. పద్మలత, తెలుగుదేశం, బిఎస్పి, బిజెపి పార్టీల ప్రతినిధులు కె. కోటేశ్వర రావు, జే. కృష్ణారావు, ఎం. గోపాల పాత్రుడు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు వేగవంతం చేయాలి

పాడేరు: మన బడి- మన భవిష్యత్తు కింద సమగ్ర శిక్ష అభియాన్ పనులను చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ సివిల్ వర్క్స్ పురోగతిపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పిఎం శ్రీ కింద నిర్మిస్తున్న 23 పాఠశాలలను ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కెజిబివి పాటశాలలో మేజర్, మైనర్ మరమ్మత్తులను మే నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. కొత్తగా 33 పాఠశాలలకు మంజూరైన భవనాల నిర్మాణానికి, 75 పాఠశాలలకు మంజూరైన అదనపు తరగతుల గదుల నిర్మాణానికి గల అవకాశాలను సంబంధిత ఎంఇఓ ల ద్వారా ఫీజిబిలిటి నివేదికలు త్వరగా అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కెప్టెన్ స్వామి నాయుడు, డిఇఓ పి. బ్రహ్మాజీరావు, సమగ్ర శిక్ష ఇఇ నరసింహరావు, గిరిజన సంక్షేమ ఇఇలు జి. డేవిడ్ రాజు, కె.వేణుగోపాల్, డిఇఇలు, ఎఇఇలు పాల్గొన్నారు.

మహిళలకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని గద్యగూడ గ్రామంలో గురువారం అరుకు సీఐ ఎల్ హిమగిరి ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా గ్రామంలో మహిళలకు, వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలు ముందు ముందు ఇంకా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. నాటుసారా, గంజాయి వంటి మత్తు పానీయాలకు బానిసవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె భరత్ కుమార్ నాయక్, మహిళా కళాశాల ప్రిన్సిపల్ పి చలపతిరావు, ఎన్ఎస్ఎస్ పిఓలు పి నాగబాబు,వై విజయలక్ష్మి,ఎం అనిత కుమారి, జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు, ప్రధాన కార్యదర్శి గౌరీ శంకర్, కోఆర్డినేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



రగ్గులు పంపిణీ చేస్తున్న సిఐ



మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

నిరుద్యోగ భృతి ఏదీ?

-మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-చింతపల్లి: ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి నాయకులు రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వం పని చేస్తుందని మాయమాటలు చెప్పి అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా పట్టించుకోలేదని పాడేరు వైకాపా మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి విమర్శించారు. చింతపల్లి, జీకే వీధి ఎంపీపీలు కోరాబు అనూష దేవి, బోయిన కుమారిలతో కలిసి ఎంపీపీ నివాస గృహంలో పాత్రికేయులతో మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని వైకాపా నాయకులు ప్రశ్నిస్తుంటే ఎదురుదాడి చేయడం ఎంతవరకు సమంజసమని ఆమె మండిపడ్డారు. ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అమలు చేయాలని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తో పాటు సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని లేకపోతే ప్రభుత్వంపై మరో ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం



రక్త దానం చేస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం జాతీయ సేవా పథకం, కళాశాల రెడ్ క్రాస్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్త దానం కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భరత్ కుమార్ నాయక్ ప్రారంభించారు. ఈ శిబిరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా 30 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కళాశాల ప్రిన్సిపల్ పి చలపతిరావు, అరకు సిఐ ఎల్ హిమగిరి, అల్లూరి జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు, ప్రధాన కార్యదర్శి జి గౌరీశంకర్, ఎన్ఎస్ఎస్ పిఓలు పి నాగబాబు, వై విజయలక్ష్మి, ఎం.అనిత కుమారి, కళాశాల రెడ్ క్రాస్ పి సుందరి రాణి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె పుష్పరాజు, రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు టి ప్రసాద్ నాయుడు, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు బి నాగరాజు, జిల్లా కోఆర్డినేటర్ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరిజన చట్టాల అమలులో విఫలం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఆదివాసీ హక్కులు, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, గిరిజన చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వంతల నాగేశ్వరావు విమర్శించారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో సిల్వర్ నగర్ లోని సంఘం కార్యాలయంలో ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ..జిల్లాలో 5వ షెడ్యూల్ ప్రాంతంలో 1/70, పేసా చట్టాలు అమలుకు నోచుకోకపోవడం విచారకరమన్నారు.

ప్రభుత్వ ఆస్తులు, కాలువలు, కుంటలు, పోరంబోకు భూములు యదేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నా రెవిన్యూ, పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బినామీ పేరుతో రిసార్ట్స్ హోటళ్లు, బహుళ అంతస్తు భవన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఏజెన్సీలో గిరిజనేతరుల భూ కబ్జాలకు, షాపులకు, ఇళ్లకు కరెంట్ అనుమతుల కోసం పంచాయతీ కార్యదర్శులు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఇస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ స్పందించి షెడ్యూల్ ఏరియాలో భూ కబ్జాలు నివారణకు 1/70 చట్టం పటిష్ట అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

చైతన్య యాత్రల్లో సమస్యల ఏకరువు

పరిష్కారంలో కూటమి ప్రభుత్వ వైఫల్యంపై సిపిఎం నిరసన



పాడేరు మండలం వంటలమామిడిలో ఆందోళన

ప్రజాశక్తి -పాడేరు: రాష్ట్రంలో కూటమి సర్కారు తీరుతో సచివాలయాలు వెలవెల బోతున్నాయని, ప్రజలు తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితి ఏర్పడిందని సిపిఎం జిల్లా నాయకుడు పాలికి లక్కు ధ్వజమెత్తారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్ర గురువారం పాడేరు మండలం మోదపల్లి పంచాయతీ లో నిర్వహించారు. ఈ సందర్భంగా వంటల మామిడి పంచాయతీ సచివాలయం ముందు గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు కావస్తున్నా ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు ఈ గ్రామంలో చేపట్టలేదని తెలిపారు. పలు సమస్యలపై మొత్తం 73 దరఖాస్తు వచ్చాయన్నారు. అర్హులైన వారికి అంత్యోదయ కార్డులు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుర్రగరువు, పందిదుర్లు, బొర్రగొంది, కాంగెడ గ్రామస్తులు పాల్గొన్నారు.

పిఎం జన్మన్ గృహాలకు రూ.10 లక్షలు ఇవ్వాలి

పెదబయలు : పిఎం జన్మన్ స్కీం కింద గృహాలకు రూ. 10 లక్షలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స డిమాండ్ చేసారు. ప్రజా చైతన్య యాత్ర లో భాగంగా మండలంలోని అడుగులు పుట్టు పంచాయితీలో సిపిఎం నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాల నుంచి ఆదిమ తెగలైన పి.వి.టి.జి కొందు గిరిజనులకు ఉపాధి పథకం పనులు కల్పించక పోవడం అన్యాయ మన్నారు. తక్షణమే ఉపాధి పని కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఒక్కరికి అటవీ హక్కులు పట్టాలు ఇవ్వలేదన్నారు. గృహాల నిర్మాణా సామాగ్రి మార్కెట్లో విపరీతంగా ధరలు పెరిగాయని, వాటికి అనుగుణంగా ఇల్లు నిర్మాణం పూర్తి చేయాలంటే ప్రతి ఇంటికి కనీసం 10 లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. గిరిజనులకు ఉచితంగా ఇసుక పంపిణీ చేయాలన్నారు. గ్రామాల్లోకి సమస్యలు పరిష్కారం చేయడంలో అధికార యంత్రాంగం పూర్తి విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు వంతల దాస్, ప్రజలు పాల్గొన్నారు.

అసంపూర్తి వంతెన పూర్తిచేయాలి

డుంబ్రిగుడ: సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని కొర్రాయి రోడ్డు గత్తర జిల్లెడ గడ్డ వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెనను నాయకులు పరిశీలించారు. పూర్తిగా నిర్మించాలని కోరుతూ సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బి పోతురాజు ఆధ్వర్యంలో పంచాయితీ గిరిజనులు ఆందోళన చేపట్టారు. గసభ పంచాయితీ కూడ గ్రామంలో సందర్శించి ఆ గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో పార్టీ నేతలు పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నిలిచిన రింగ్‌రోడ్డు పనులు చేపట్టాలి

అనంతగిరి: మండలంలోని కొండిభ, టోకూరు పంచాయితీల సరిహద్దు గ్రామాలకు నిలిచిన బీటీ రింగ్ రోడ్డు పనులు తక్షణమే పూర్తి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి, టోకురు పంచాయతీ సర్పంచ్ కిల్లో . మొస్యా డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా చైతన్య యాత్ర గురువారం నిర్వహించారు. టోకూరు పంచాయతీ ములియగూడ మెయిన్ రోడ్ నుండి కొండిబా పంచాయితీ మూవం వలస. లింబగుడ. మీదుగా టోకురు వరకు బీటీ నిర్మాణానికి 2018 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. పనులు పూర్తి చేయకుండా నిలిపివేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు .నాగేశ్వరరావు, కార్యకర్తలు కె. దున్ను, నందో, గోపాల్.తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం

చింతపల్లి: గిరిజన ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు తక్షణమే చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. మండలంలోని తాజంగి 2వ సచివాలయం పరిధి గ్రామాల సమస్యలపై ఆయా గ్రామాల ప్రజలతో నిరసన చేపట్టి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణానికి 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాల్లో రోడ్డు, మంచినీరు, కమ్యూనిటీ భవనాలు వంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిసా కమిటీ అధ్యక్షుడు జీ కొండబాబు పాల్గొన్నారు.

హైడ్రో ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలి

అనంతగిరి: మన్యంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులను రద్దు చేయాలని సిపిఎం జెడ్పిటిసి దీసరి. గంగరాజు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని మారుమూల పెద్ద కోట పంచాయితీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేగులపలెం, కొండిబకోట తముటు, చింతలపాలెంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుతో సాగు భూములు నాశనం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పీసా కమిటీ ఉపాధ్యక్షులు సింహాచలం, జి. ఆనంద్, వార్డ్ మెంబర్ జి. గోవిందు పాల్గొన్నారు



పెదబయలులో మాట్లాడుతున్న అప్పలనర్స

రోడ్డు వేయకుండానే బిల్లులు స్వాహా

కొయ్యూరు: మండలంలోని నిమ్మలపాలెం, జోడు మామిడి, గొప్పవీధి, రబ్బసింగి తదితర గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యాన గురువారం ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకుడు గెమ్మెలి సాన మాట్లాడుతూ ఉసిరికపాలెం, జోడు మామిడి, కుబుర్ల బందం, జాజుల బందం రోడ్లు పూర్తిస్థాయిలో వేయకుండా కాంట్రాక్టర్లు, అధికారులు బిల్లులు మార్చుకున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లు వెంటనే పూర్తి చేయాలని కోరారు. పివిటిజిలకు పీఎం జన్మన్ హౌసింగ్‌కు రూ.2.30 లక్షలు గ్రాంట్‌కు లక్ష రూపాయలు పెంచారని, అయితే అది ఏమాత్రం సరిపోవడం లేదని, రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం సభ్యులు గెమ్మెలి సోమయ్య సన్యాసిరావు, అచ్చిబాబు, ఎస్ సూరిబాబు, వై. అప్పలనాయుడు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో నిరసన చేపడుతున్న నాయకులు



అనంతగిరిలో మాట్లాడుతున్న జెడ్పిటిసి గంగరాజు



కొయ్యూరులో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

15న జాబ్‌మేళా

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : జిల్లా నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో కంచరపాలెం ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజె కార్యాలయంలో ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లానైపుణ్యాభివద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో టావ్ డిజిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, జస్పెర్ ఇండస్ట్రీస్, ఇన్నోవ్ సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని, నిరుద్యోగ అభ్యర్థులకు ఇంటర్వ్యూలునిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ,బిటెక్ పూర్తిచేసిన నిరుద్యోగ యువకులందరూ హజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులందరూ విశాఖపట్నం,శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందనిచ మరిన్ని వివరాలకు 8555868681 సంప్రదించాలని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు హెట్ప్స్://నైపుణ్యం.అప్.గౌవ్.ఇన్/ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని, అడ్మిట్ కార్డుతో ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చన్నారు.స్పాట్ రిజిస్ట్రేషన్ కుడా ఉందని, ఆధార్ నెంబర్, దానికి అనుసంధానమైన మొబైల్ నెంబర్‌తో ఇంటర్వ్యూకు రావాలని సూచించారు.

నిద్ర లేమితో శారీరక, మానసిక రుగ్మతలు

ప్రజాశక్తి- సీతమ్మధార : నిద్రలేమితో శారీరక, మానసిక సమస్యలు ఉత్పన్నమై, తద్వారా దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయని ప్రభుత్వ మానసిక వైద్యశాల పర్యవేక్షకుడు డాక్టర్ ఎన్.ఎన్. రాజు అన్నారు. గురువారం ప్రపంచ నిద్ర దినోత్సవం సందర్భంగా ఎంవిపి కౌసల్య కౌన్సెలింగ్ సెంటరు అధ్వర్యంలో పబ్లిక్ లైబ్రరీలో అవగాహన సదస్సు నిర్వహిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ ఏడాది నిద్ర ఆరోగ్యాన్ని ప్రాముఖ్యంగా పరిగణించాలనే నినాదాంతో అంతరాజ్జతీయ నిద్ర దినోత్సవం జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. . ప్రతి జీవికి నిద్ర అత్యవసరమని, నిద్ర లేకుండా మనుగడ సాగదన్నారు. నిద్రలో శరీరం ఏమీ చేయకుండా అచేతనవస్థలో ఉండదని, శరీరానికి కావలిసిన అవసరాలను సన్నద్ధం చేసుకుంటుందన్నారు సగటున రోజుకు ఆరేడు గంటలు అవసరమని, నిద్ర ముగిసిన తరువాత కలిగే విశ్రాంత భావన ముఖ్యమన్నారు. నిద్ర లేమితో నిరాసక్తి, నీరసత్వం ఆవహిస్తుందని, చిరాకు, ఆందోళన ప్రస్ఫుటంగా కనిపిస్తాయన్నారు. దీర్ఘకాలం నిద్రలేమితో మధుమేహం, బీపీ, గుండె జబ్బులు అలాగే మతిమరపు వ్యాధి వచ్చే అవకాశాలున్నాయన్నారు

సరైన నిద్రకు సమయ పాలన, పౌష్టిక ఆహారం, దినసరి వ్యాయామం వంటి నిర్దిష్ట ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. టీ, కాఫీ, మద్యం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, యోగా, ధ్యానంతో ఒత్తిడిని తగ్గించుకుని చక్కని నిద్రను సాధించవచ్చన్నారు. వైద్యుల పర్యవేక్షణలో మందుల సాయంతో సుఖ నిద్ర పొందవచ్చన్నారు. కార్యమానికి పిఎస్ కుమార్ స్వాగతం పలుకగా, కౌసల్య కౌన్సెలింగ్ సెంటరు వైద్యుడు డాక్టర్ ఎన్. జి.నిహాల్ వందన సమర్పణ చేసారు

క్రీడల్లో ఆంధ్ర మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య ఆరోగ్య శాస్త్రాల విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 26వ రాష్ట్ర అంతర్ వైద్య కళాశాలల క్రీడా పోటీలు ఈ నెల 8 నుంచి 11 వరకు గన్నవరంలోని చిన్న అవుట్ పల్లిలో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలలో జరగ్గా ఆంధ్ర మెడికల్ కాలేజీ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి విశేష విజయాలను సాధించారు. వాలీబాల్ పోటీలో కరుణాకర్ రాజు (కెప్టెన్) నేతృత్వంలో అద్భుత ఆటతీరు కనబరిచి విజేతగా నిలిచారు. అలాగే బాల్ బ్యాడ్మింటన్ పోటీలో భాను ప్రకాష్ (కెప్టెన్) ఆధ్వర్యంలో హోరాహోరీ పోరాటం చేసి రన్నరప్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ విజయాల సందర్భంగా ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ఎం.సంధ్యాదేవి విజేతలకు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. క్రీడలతో పాటు విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో భాను సతీష్ (స్పోర్ట్స్ సెక్రటరీ), డాక్టర్ ఎంఎస్ఎన్.పాత్రుడు (ఫిజికల్ డైరెక్టర్) తదితరులు పాల్గొన్నారు.

మూత్రపిండాల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్/ఎంవిపి.కాలనీ : మూత్రపిండాల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంద్ర ప్రసాద్ అన్నారు. ప్రపంచ కిడ్నీ డే సందర్భంగా ఆసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్‌కె.బీచ్‌లో కిడ్నీల ఆరోగ్యంపై చెన్నయ్ సైకత కళాకారుడు గజేంద్రన్ రూపొందించిన కిడ్నీ సైకత శిల్పాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేహంలో రక్తాన్ని శుభ్ర పరిచే కిడ్నీల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మన దేహంలో వ్యర్థాలను శుద్ధి చేసే అతి ముఖ్యమైన విధిని కిడ్నీలు నిర్వహిస్తాయని చెప్పారు. మన శరీరంలోని అంతర్గత అవయవాల పని తీరు పట్ల జాగ్రత్త వహించాలన్నారు. నిర్ణీత కాల వ్యవధిలో అవసరమైన వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖ బ్రత బాగ్చి మాట్లాడుతూ కిడ్నీలు బాగా పని చేసినన్ని రోజులు ఆరోగ్యం బాగానే ఉంటుందన్నారు. అవి చెడిపోతేనే వాటి విలువ తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ హాస్పిటల్ డాక్టర్ అమిత్ సాప్లే, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, హాస్పిటల్ యూరాలజిస్ట్ డాక్టర్ పి.శ్రీధర్, నెఫ్రాలజిస్టులు డాక్టర్ ఉదయ్ దీపక్ గజారే, డాక్టర్ వైష్ణవి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైకత శిల్పం

ప్రపంచ కిడ్నీ డేను పురస్కరించుకొని చెన్నైకి చెందిన కళాకారుడు గజేంద్రన్ రంగు రంగుల సైకత శిల్పం రూపొందించారు. కిడ్నీల పనితీరు, వాటిని పరీక్షించుకోవాల్సిన అవసరం, కిడ్నీ అనారోగ్య నివారణపై ప్రధానంగా చెప్పారు. దీన్ని స్థానికులతో పాటు పలువురు పర్యాటకులు కూడా ఆసక్తిగా చూశారు. ఆరోగ్య అభిలాషులు ఈ సైకత శిల్పాన్ని సందర్శించారు.ఈ సృజనాత్మక కళ ద్వారా కిడ్నీ ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ఉమామహేశ్వర ఆలయంలో పార్వతీ పరమేశ్వరులు కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. దీనికి ముందు శివాలయంలో ఉదయం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గిరిజనేతరుల ఇళ్ల నిర్మాణాలు ఆపాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని అనేకమంది గిరిజనేతరులు గృహ నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని తాము సూరిబాబు గురువారం రాజవొమ్మంగి గ్రామ సచివాలయం, తహశీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. మండలంలోని అనేకమంది గిరిజనేతరులు అక్రమ కట్టడాలు, 1/70కి విరుద్ధంగా పక్కా గృహాలు నిర్మిస్తున్నారని, తక్షణం వాటిని నిలుపుదాల చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నేతలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-కొయ్యూరు : ఏజెన్సీ నుండి మైదాన ప్రాంతానికి గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు కొయ్యూరు మండలం చిడిపాలెం జంక్షన్ వద్ద బుధవారం తనిఖీలు చేపట్టగా 6.5 కేజీల గంజాయిని తరలిస్తున్న ద్విచక్ర వాహనాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. వారి నుండి గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులు విజయవాడ సిటీకి చెందిన దకమురి ధన అరుణ్ కుమార్, విజయవాడ రూరల్‌కు చెంది. సాతులూరి వసంత సాయికుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామనిమ ఎస్సై కిషోర్ వర్మ తెలిపారు.

విద్యుత్ ఉత్పత్తిలో సుస్థిర ప్రగతి

తెలుగు రాష్ట్రాల అవసరాలకు తగ్గట్టు సరఫరా
విదేశీ బొగ్గు ఎన్‌టిపిసికి అవసరం లేదు
165 ఎకరాల ప్లాంట్‌లో 75 ఎకరాల్లో సోలార్ పవర్ ఉత్పత్తి
మీడియా సమావేశంలో ఎన్‌టిపిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ వెల్లడి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల విద్యుత్ అవసరాలను తీర్చడమే కాకుండా అనేక సందర్భాల్లో దేశంలోని కర్నాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల ఎనర్జీ అవసరాలను తీర్చడంలోనూ ఎన్‌టిపిసి (సింహాద్రి) కీలకపాత్ర పోషిస్తూ సుస్థిర ప్రగతి దిశగా ముందుకెళ్తోందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ వెల్లడించారు. గురువారం ఉదయం విశాఖలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలి బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ స్టేషన్ ఎన్‌టిపిసి సముద్రం నుంచి నీటిని తీసుకుని బొగ్గును మండించడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందన్నారు. అనకాపల్లి జిల్లా పరవాడలో సంస్థ అత్యుత్తమ ఉత్పత్తి సామర్థ్యంతో రోజుకు 2 వేల మెగావాట్లను తయారు చేస్తోందన్నారు. ఎన్‌టిపిసి ప్లాంట్‌కు బంగాళాఖాతం, ఏలేరు కాలువనే ప్రధాన నీటి వనరు అని చెప్పారు. ఎపికి 36 శాతం, తెలంగాణకు 38.5 శాతం విద్యుత్‌ను ఆయా రాష్ట్రాల అవసరాలకు అందిస్తున్నామన్నారు. వంద శాతం యాష్‌ను ఉపయోగిస్తున్నామని తెలిపారు. ప్రాచ్య దేశాలకు పైప్‌లైన్ ద్వారా ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. త్వరలో పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ను ప్రారంభించబోతున్నామన్నారు. 1200 ఎకరాలు దీనికోసం అవసరం అవుతుందని కేంద్రానికి డిపిఆర్ ప్రతిపాదనలు పంపినట్లు సమీర్ శర్మ తెలిపారు. న్యూక్లియర్ ప్లాంట్ అగ్రిమెంట్‌పై కేంద్ర ప్రభుత్వంతో ఇంకా చర్చలు జరపాల్సి ఉందన్నారు.

ఎన్‌టిపిసికి బొగ్గు అవసరాలకుగానూ దేశంలో బిగ్ ప్లేయర్లను ఆహ్వానించిందా ? అనే ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ బయట నుంచి బొగ్గును దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఎన్‌టిపిసికి లేదని, అంతర్గతంగానే దేశీయంగా బొగ్గు సరిపడా ఉందని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 1150 మెగా యూనిట్ల కరెంట్ ఉత్పత్తి చేశామని, సోలార్ జనరేషన్ 37 మెగా యూనిట్లు చేశామని తెలిపారు.



మాట్లాడుతున్న సమీర్ శర్మ

సోలార్ ఎనర్జీలో నెంబర్ వన్

165 ఎకరాల్లో 75 ఎకరాలను సోలార్ ఎనర్జీ కోసం వినియోగిస్తూ గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నామన్నారు. 2021లో ఆసియాలోనే మొదటి సోలార్ పవర్ ప్రాజెక్టును తాము ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, కర్నాటక, తమిళనాడు, పాండిచ్చేరి విద్యుత్ డిమాండ్స్‌కు తగ్గట్టుగా ఎనర్జీని అందిస్తున్నామన్నారు. రాగల 39 నెలల్లో 500 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టును ఎన్‌టిపిసి ఏర్పాటు చేసుకోబోతుందని వెల్లడించారు. ఎన్‌టిపిసి (సింహాద్రి) ఏర్పాటై 50 ఏళ్లు అయిన సందర్భంగా ప్లాంట్ చుట్టూ ఉన్న 29 గ్రామాల్లో పలు సిఎస్ఆర్ కార్యక్రమాలు చేపడున్నామన్నారు. ముత్యాలమ్మపాలెం, చిన్నపాలెం గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, నిరంతర విద్యుత్ సరఫరా వంటి సేవలు అందిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో లక్షల మొక్కలను నాటుతున్నామన్నారు. సమావేశంలో జిఎం ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రశాంత జెనా, జిఎం (టిఎస్) ఎస్.పద్మప్రియ, హెచ్ఓ హెచ్ఆర్ భక్త బత్సల పాత్ర పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రంపచోడవరం : మెయింటినెన్సులో భాగంగా విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా రంపచోడవరం, సిరిగిందలపాడు పరిసర ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.గాబ్రియేల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వినియోగదారులు తమకుగల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వికాస్ పాండే అన్నారు. గురువారం దసపల్లా హోటల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న అంతర్జాతీయ కన్స్యూమర్ డే సందర్భంగా జిల్లా పరిషత్ ఫంక్షన్ హాల్ వేదికగా 12 రాష్ట్రాల నుంచి వచ్చిన సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉక్కు ప్రైవేటీకరణపై ఎల్ఐసి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని, సొంత గనులు కేటాయించాలని, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో విశాఖలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న 20 ఎల్ఐసి కార్యాలయాల ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఈ నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో డివిజన్ వ్యాప్తంగా సుమారు 1000 మంది పాల్గొన్నారు. డివిజన్ కేంద్రం విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలంటూ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు, అన్ని ప్రజా సంఘాలు దాదాపు నాలుగు సంవత్సరాలగా పోరాటం సాగిస్తున్నాయని చెప్పారు. ఈ పోరాటాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీ రూ.11440 కోట్లు కేటాయించిందన్నారు. అయితే ఈ ప్యాకేజీ వల్ల స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగేది లేదన్నారు. స్టీల్ ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో నడవాలంటే సొంత గనులు కేటాయించాలన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

విద్యార్థులకు మెడిటేషన్ తరగతులు నిర్వహించాలి

ప్రజాశక్తి-సీలేరు : పదో తరగతి విద్యార్థులకు మెడివేషన్ తరగతులు నిర్వహించాలని జికె వీధి తహశీల్దారు రామకృష్ణ ఉపాధ్యాయులను ఆదేశించారు. జీకే వీధి మండలం పెదవలస హైస్కూల్‌ను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థుల తరగతి గదులకు వెళ్లి విద్యలో అనుసరించవలసిన విధానాలు గురించి వివరించారు. ఆత్మవిశ్వాసం, పరీక్షల్లో బాగా చదవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సిలబస్ క్విక్ రివిజన్ గురించి విద్యార్థులకు తెలియజేశారు. మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. అనంతరం పెదవలస సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఫోర్ సర్వేలో డెత్ పర్సన్ వివరాలు మాత్రమే పూర్తి కాలేదని 90శాతం సర్వే పూర్తయిందని తెలిపారు. పచ్చదనం పరిశుభ్రతకు కార్యాచరణ రూపొందించాలని, ఎక్కడ కూడా ప్లాస్టిక్ సీసాలు లేకుండా చూడాలని కోరారు. ప్రతి మూడో శనివారం పచ్చదనం పరిశుభ్రత స్వచ్ఛ ఆంధ్రను తూచ తప్పకుండా నిర్వహించాలన్నారు. ఈనెల 16న పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించాలని ఆదేశించారు.

ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటర్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని రంపచోడవరం ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు ఎన్‌వి సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో బిఎల్‌ఓలతో ఓటర్ కార్డుల నమోదుపై గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న 43 మంది బిఎల్‌ఓలు యువతీ యువకులు ఓటు నమోదు చేసుకొనే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు జిలాని, బిఎల్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారుల అకౌంట్లో డబ్బులు జమ చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : నాయీ బ్రాహ్మణ చేతివృత్తుల వారికి ఇచ్చే ఉపాధి యూనిట్లు కాకుండా నేరుగా లబ్ధిదారుల అకౌంట్లో డబ్బులు జమ చేయాలని రంపచోడవరం నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు నరవ రాంబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2014-19 మధ్య కాలంలో అప్పటి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా నాయీ బ్రాహ్మణులకు చేతి వృత్తి పరికరాలు ఇస్తామని ప్రతి ఒక్క సభ్యుడి నుండి రూ.3000 బీసీ కార్పొరేషన్‌కు డిడి ద్వారా తీసుకున్నారని తెలిపారు. కాని ఏ ఒక్క సభ్యుడికి ఒక పనిముట్టు కూడా ఇవ్వలేదన్నారు. ఈసారి పనిముట్లు కాకుండా నేరుగా లబ్ధిదారుల అకౌంట్లో రుణం డబ్బులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులు పాట్నాల లక్ష్మణరావు, సూదికొండ వెంకటేశ్వరరావు, బండారు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి మార్గం మధ్యలో ప్రసవం

ప్రజాశక్తి-కొయ్యూరు : గిరిజన మహిళకు అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో ఫీడర్ అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో డెలీవరి చేశారు. ఫీడర్ అంబులెన్స్ ఈఎంటి విజయ్ తెలిపిన వివరాలు ప్రకారం... కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం పంచాయతీ పరిధి పాడి పివిటిజి గ్రామానికి చెందిన గిరిజన మహిళ గెమ్మెలి లింబో అనే గర్భిణికి బుధవారం అర్ధరాత్రి పురిటి నొప్పులు వచ్చాయి. రాజేంద్రపాలెం పిహెచ్‌సికి సమాచారం ఇవ్వగా ఆసుపత్రి ఫీడర్ అంబులెన్స్ ఈఎంటి విజయ్ గ్రామానికి వెళ్లి గర్భిణిని తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అక్కడే గర్భిణీకి ప్రసవం చేసి అనంతరం రాజేంద్రపాలెం పీహెచ్సీకి తరలించినట్లు విజయ్ తెలిపారు.